క్లుప్తంగా

కొనసాగుతున్న భక్తుల రద్దీ



పెద్దింట్లమ్మ ఆలయం వద్ద కొనసాగుతున్న భక్తుల రద్దీ

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువైన పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ కొనసాగుతోంది. బుధవారం ఉదయం నుంచి సుదూర ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఎండోమెంట్స్ ఆధ్వర్యంలో అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ పర్యవేక్షణలో గత నెల 28వ తేదీ నుంచి ఉత్సవాలు సాగుతున్నాయి. ఈ నెల 28వ తేదీ వరకూ జరుగనున్నవి. కాగా అమ్మవారి దర్శనం అనంతరం భక్తులు సమీప కొబ్బరితోటల్లో పిల్లా పాపలతో సేదతీరి తిరిగి పయనమవుతున్నారు.

సంత పేటలో ఆక్రమణల తొలగింపు

మామిడికుదురు: పాశర్లపూడి గ్రామంలోని సంతపేటలో బుధవారం ఆక్రమణలను తొలగించారు. సంతపేటలో ఆక్రమణల వల్ల పూర్వం నుంచి వారం వారం నిర్వహించే సంతకు ఇబ్బంది ఏర్పడిందని స్థానికులు సీఎంకు, కలెక్టర్ గ్రీవెన్స్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు ఆక్రమణల తొలగింపునకు అనుమతి ఇచ్చారు. దీంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో సంత పేటలోని ఆక్రమణలను తొలగించారు. సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి ఆక్రమణల తొలగింపు పనులను పర్యవేక్షించారు.

వైద్యఖర్చులకు రూ.60 వేల సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సంఘ సభ్యులు

మలికిపురం: మండలంలోని ఇరుసుమండలో అనారోగ్యంతో బాధపడుతున్న తల్లీకొడుకులు పాటి లక్ష్మి, శివకృష్ణలకు వైద్య సాయం నిమిత్తం గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ రూ.60 వేలు ఆర్థికసాయం అందజేశారు. గ్రామంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు గుబ్బల శ్రీనివాస్, కాకి లక్ష్మణ్, దొంగ మహేష్, బైరిశెట్టి వెంకటరమణ, కుడుపూడి రాంబాబు, పాటి బాబురావు పాల్గొన్నారు.

షిర్డీ సాయికి అభిషేకాలు

మామిడికుదురు: పెదపట్నంలో కొలువుదీరిన శ్రీషిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవాన్ని మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా చివరి రోజు బుధవారం అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం కాకడ హారతి తదుపరి పంచామృతాలతో అభిషేకాలు వైభవంగా జరిపించారు. మండపేటకు చెందిన అమృత వర్షిణి భక్త బృందం ఆలపించిన సాయిభక్తి గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు మందిరం వద్ద విశేష అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి షిర్డీ సాయిబాబాను దర్శించుకున్నారు. ఆమెను మందిర కమిటీ ఘనంగా సత్కరించింది.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

ఆలమూరు: రహదారుల్లో వాహనాలు నడిపే సమయంలో ఆటో డ్రైవర్లు అందరూ నిబంధనలు పాటించడంతో పాటు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని రావులపాలెం రూరల్ విద్యాసాగర్ సూచించారు. మండల కేంద్రమైన ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్‌లో బుధవారం ఆటో డ్రైవర్లతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి రహదారి నిబంధనలపై అవగాహ న కల్పించారు. ఆటోలో తప్పనిసరిగా రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు అందరూ విధిగా యూనిఫాం ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటించాలని రూరల్ సీఐ విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు. అనంత రం వాహనాలను రికార్డులను తనిఖీ చేసి వాహన దారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

రావులపాలెం: ఇసుక తవ్వకాల్లో కాంట్రాక్టర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ అన్నారు. మండలంలోని పొడగట్లపల్లి, ఊబలంక ఇసుక ర్యాంపులను ఆయన బుధవారం టాస్క్ ఫోర్స్ బృందంతో కలిసి సందర్శించారు. ర్యాంపుల్లో తవ్వకాలు, ఇసుక స్టాక్ పాయింట్ వద్ద పరిశీలన చేసి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైనింగ్ శాఖ అధికారులు సూచించిన పరిధిలోని తవ్వకాలు చేయాలన్నారు. ఉచిత ఇసుకలో అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముక్తేశ్వరరావు, ఎంపీడీవో మహేష్, ఆర్ఐ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు.. లాభాలు బాగు

- ఆదర్శంగా నిలుస్తున్న రైతులు
- సిరులు కురిపిస్తున్న పంటలు

మామిడికుదురు: ఆవు పేడ, గోమూత్రం, కుంకుడుకాయ రసం, పుట్టమట్టి, పుల్లటి మజ్జిగ, శనగ పిండి, బెల్లం తదితర సహజ సిద్ధమైన వాటితో తయారు చేసిన ద్రావణాలను వాడుతూ పలువురు ఔత్సాహిక రైతులు సిరులు కురిపించే పంటలు పండిస్తున్నారు. పంటల సాగులో ఎక్కడా క్రిమి సంహారకాలు, రసాయన ఎరువులు వాడకుండా సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించే ప్రకృతి సాగు విధానంలో పంటలు పండిస్తూ అటు అధికారులు, ఇటు ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. నగరం దీవికి చెందిన పలువురు ఔత్సాహిక రైతులు ప్రకృతి సాగులో పంటలు పండిస్తూ ఔరా అనిపిస్తున్నారు. పురుషులతో పాటు యువతరం మహిళలు సైతం ఈ విధానంలో ముందుకు వెళ్తున్న తీరు ప్రశంసలందుకుంటోంది.

తైవాన్ జామ సాగు..

మామిడికుదురుకు చెందిన రైతు నయినాల శ్రీరంగనాథం ఎకరం విస్తీర్ణంలో తైవాన్ జామ సాగు చేస్తున్నారు. ఇతను కూడా ప్రకృతి వ్యవసాయంలోనే ఈ పంట పండించారు. ప్రస్తుతం బొప్పాయి కాపుకు వచ్చిందని ఆయన తెలిపారు. దీంతో పాటు రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో కొబ్బరి తోటలో కోకో పంట సాగు చేశానన్నారు. వీటితో పాటు అనాస, వక్క తదితర పంటలు పండిస్తున్నానని చెప్పారు. కేవలం ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రకృతి సాగులో ఈ పంటలు పండిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ విధానంలో పెట్టుబడి తక్కువ అవుతుందని ఆదాయం ఆశాజనకంగా ఉంటుందని శ్రీరంగంనాథం చెప్పారు.



మామిడికుదురులో తైవాన్ జామ పండిస్తున్న శ్రీరంగనాథం

తమతో పాటు ఎంతో మంది ఈ విధానాన్నే పాటిస్తున్నారన్నారు.

రెండెకరాల్లో పంటల సాగు..



పాశర్లపూడిలో తైవాన్ బొప్పాయి సాగు చేస్తున్న శ్రీనివాసరావు

మామిడికుదురుకు చెందిన రైతు కోలా శ్రీనివాసరావు రెండెకరాలకు పైగా పొలంలో ప్రకృతి వ్యవసాయంలో కొబ్బరిలో అంతర పంటలు పండిస్తున్నారు. ఇతను పాశర్లపూడిలో అరెకరంలో తైవాన్ రకం బొప్పాయి. తైవాన్ రకం నిమ్మ, దాని చుట్టూ వక్క పండిస్తున్నారు. కొబ్బరి తోటల్లో కోకో పంట కూడా పండిస్తున్నారు. దీంతో పాటు ప్రకృతి సాగులోనే వరి పంట కూడా పండిస్తున్నారు. ఏడు నెలల క్రితం తైవాన్ రకంతో పాటు రెడ్ లేడీ, కో-15 రకం బొప్పాయి సాగు చేశానన్నారు. ఈ పంట ప్రస్తుతం కోత దశకు వచ్చిందని చెప్పారు. మరో 15 రోజుల్లో బొప్పాయి కాయలు కోతకు వస్తాయన్నారు. పంట చక్కగా పండిందని, దిగుబడి కూడా ఆశాజనకంగా ఉందని చెప్పారు.

ఆకు కూరలు, దుంప కూరల సాగు..

సఖినేటిపల్లికి చెందిన కోటి చిట్టి స్వరాజ్ డిగ్రీ చదివారు. ఆమె 50 సెంట్ల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. పలు రకాల ఆకుకూరలు, దుంప, పండ్ల, తీగ జాతి మొక్కలు ఏర్పాటు చేసి వాటి ద్వారా మంచి ఆదాయం పొందుతున్నారు. పురుగు మందులు లేని ఆరోగ్యవంతమైన ఆహారాన్ని తమ కుటుంబ సభ్యులు తింటూ మిగిలిన ఉత్పత్తులను ప్రకృతి వ్యవసాయ స్టాల్ ద్వారా వారం వారం మార్కెటింగ్ చేస్తున్నానని చెప్పారు. 2019 నుంచి తాను వ్యవసాయం చేస్తున్నానన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ వస్తుందన్నారు. పురుగు మందులు, రసాయన అవశేషాలు లేని ఆరోగ్యకరమైన ఆహారం తింటున్నామని చెప్పారు.



సఖినేటిపల్లిలో ఆకు కూరలు సాగు చేస్తున్న కోటి చిట్టి స్వరాజ్

నేడు చేతివృత్తుల కుల సంఘాలతో సమావేశం

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని చేతివృత్తుల కుల సంఘాలతో సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.సూర్యనారాయణ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఆదరణ-3 పథకం ప్రవేశపెట్టడానికి గాను ప్రణాళికలు రూపొందించే నిమిత్తం జిల్లా కలెక్టర్ ఆదేశాలపై ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. కాగా సమావేశం ద్వారా ఇచ్చే సమాచారం ఆధారంగా పథకం ప్రణాళిక రూపొందిస్తామన్నారు.

ఎస్సైగా శాస్త్రి బాధ్యతల స్వీకరణ



అయినవిల్లి: మండల ఎస్సైగా హరికోటి శాస్త్రి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హరికోటి శాస్త్రి మండపేట టౌన్ ఎస్సైగా పని చేసి బదిలీపై అయినవిల్లి వచ్చారు. ఇప్పటివరకూ పనిచేసిన ఎస్సై కె.మనోహర్‌జోషి వీఆర్‌కు వెళ్లారు. హరికోటిశాస్త్రి విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు.

దివ్యాంగ బాలలకు ప్రోత్సాహం

కొత్తపేట: దివ్యాంగ బాలలను ప్రభుత్వాలు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నాయని ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ అన్నారు. పారా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక భవిత కేంద్రం నందు బుధవారం కేర్ గివెర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతుల కోఆర్డినేటర్ బడుగు మహిమరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎంపీడీఓ నరేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లల విషయంలో సమస్యలను పరిశీలించి పై స్థాయి అధికారులకు ఈ సమస్యలను తెలియపరచడానికి తన వంతు బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. విభిన్న ప్రతిభావంతుల తల్లిదండ్రులకు వారి పిల్లలను వారి కాళ్ల మీద వారు నిలబడేలా ఎలా తయారు చేయాలి, కాలకృత్యాలు వారంతట వారే చేసుకునేలా పిల్లలను ఏ విధంగా ప్రోత్సహించాలి అనే అంశాలను వివరిస్తూ తల్లిదండ్రులతో ప్రాక్టీస్ చేయించారు. విభిన్న ప్రతిభావంతుల హక్కుల ఆక్టివిస్ట్, రిసోర్స్ పర్సన్ బడుగు సుబ్బాయమ్మ విభిన్న ప్రతిభావంతుల హక్కులు, సంక్షేమ పథకాల గురించి అవగాహన కలిపించారు. డాక్టర్ ఎస్.సంగీత మాట్లాడుతూ ఫిజియోథెరపీ ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని తల్లిదండ్రులకు తెలియజేశారు. అనంతరం పారా అడ్మినిస్ట్రేటర్ జి.సింహారాయుల చేతుల మీదుగా పిల్లలకు కావలసిన టీఎల్ఎం కిట్, తులసీధర్ అనే దివ్యాంగునికి వీల్ చైర్ అందజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ టీచర్స్, సత్యనారాయణ, వేంకటేశ్వరరావు, బ్లాక్ కోఆర్డినేటర్ ఐశయ్య, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కొత్తపేట భవిత సెంటర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేష్‌కుమార్

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

అంబాజీపేట: వరి పంట పొలాలకు సాగు నీరు అందిస్తున్న పంటబోదెను ఆక్రమించిన వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుని నీరు అందించాలని ఇసుకపూడి శివారు పెండిపేట, చిరతపూడి రైతులు డిమాండ్ చేశారు. పంట బోదెను స్థానికంగా ఉన్న ఇరువురు వ్యక్తులు ఆక్రమించుకుని నీరు రాకుండా అడ్డుకుంటున్నారని అంబాజీపేట ఇన్‌చార్జి తహసీల్దార్ సీహెచ్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. ఇసుకపూడి, చిరతపూడి గ్రామాలకు సంబంధించి 150 ఎకరాల వరకు సుమారు వందేళ్ల నుంచి సాగునీరు అందుతుందన్నారు. ఈ పంట బోదెను ఇరువురు వ్యక్తులు ఆక్రమించుకుని జేసీబీ, ట్రాక్టర్లతో పూడ్చి పెట్టారని వివరించారు. పూర్వం నుంచి వస్తున్న పంట బోదె ద్వారా సాగు నీరు అందక వరి చేలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆక్రమణకు గురైన పంటబోదెను తెరిపించి సాగు నీరు అందించి తమ వరి పంటను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



అంబాజీపేటలో ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

పంటలకు శాపంగా మారిన ఉప్పునీరు

అంబాజీపేట: కొబ్బరితోటలతో పాటు వాటిలో పండించే అంతర పంటలకు మంచినీరు అందకపోవడంతో ఉప్పునీరే శాపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పి.గన్నవరం మండలం ముంజవరం నుంచి వచ్చే గోరింకల కౌశిక డ్రైన్ నుంచి పంట పొలాలకు ఆరుతడులు పెట్టేందుకు ఉపయోగపడటం లేదని రైతులు చెబుతున్నారు. నందంపూడి, తొండవరం, వాకలగరువు గ్రామాలకు సంబంధించి 300 ఎకరాల్లో కొబ్బరి, అంతరపంటలు, కూరగాయలు సాగు చేస్తున్నామన్నారు. గత 30 ఏళ్ల క్రితం వరకు మంచినీటి బోర్లు ఉండేవని వాటితో ఆరుతడులు పెట్టేవారమన్నారు. ఓఎన్‌జీసీ సంస్థ వారు బాంబ్ బ్లాస్టింగ్‌లు చేయడంతో భూమిలో ఉన్న నదీ జలాలు కలుషితమై ఉప్పునీరుగా మారిపోయాయన్నారు. దాంతో గోరింకల డ్రైను ద్వారా వచ్చే నీటిని ఉపయోగించుకునేవారమన్నారు. అయితే డ్రైయిన్‌లో ఆటు పోట్లు ఉన్నాయని పోటు సమయంలో ఉప్పు నీరుగా మారిపోతున్నాయని దాంతో పంటలకు సాగు నీరు పెట్టడం వల్ల తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. ముంజవరం లాకుల వద్ద ఉప్పు నీరు రాకుండా మూడు నెలల పాటు అడ్డు వేస్తే చప్ప నీరు వస్తుందని, పంటలకు తడులు పెట్టేందుకు వీలుంటుందని రైతులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఉప్పు నీటిలో తమ పంటలు పాడవకుండా చప్ప నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని మూడు గ్రామాల రైతులు కోరుతున్నారు.



నందంపూడిలో ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన సమాజం

మలికిపురం: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణమవుతుందని ఆ దిశగా ప్రభుత్వ చేపట్టిన కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన ఉండాలని మలికిపురం మండల వ్యవసాయ శాఖ అధికారి సీహెచ్ రమ్యప్రియాంక పేర్కొన్నారు. బుధవారం మండల వెలుగు కార్యాలయంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు, వీఓఏలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సమావేశంలో రమ్య ప్రియాంక పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రకృతి వ్యవసాయంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఎరువులు, పురుగు మందులు వాడకుండా కేవలం పేడ, కుళ్లిన చెత్త ద్వారా కూరగాయలు, వరి ఇతర పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఇంటి పెరటి, డాబాలపై కూరగాయల సాగు చేసుకుని ఇంటి అవసరాలకు వాడుకోవాలని సూచించారు. ఆధునిక సమాజంలో రసాయన ఎరువుల వాడకం వల్ల అనేక రుగ్మతలు తలెత్తుతున్నాయన్నారు. భవిష్యత్ తరాలకు ప్రకృతి వ్యవసాయం అందించాలని సూచించారు. సభలో ఎంఎస్ఏబీ డి.భవాని, ఉపాధ్యక్షులు షేక్ నగీనా, సీసీ నాగరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జోషఫ్, ఎం. శ్రీనివాసరావు, బి.కిరణ్, కె.చిట్టిబాబు, మహిళా సమాఖ్య సభ్యులు, వీవోఏలు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి రమ్య ప్రియాంక

రీ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



బి.దొడ్డవరంలో నిర్వహిస్తున్న రీసర్వే అవగాహన ర్యాలీ

మామిడికుదురు: మొగలికుదురు, బి.దొడ్డవరం గ్రామాల్లో బుధవారం భూముల రీ సర్వే ప్రారంభమైంది. రెండు గ్రామాల్లోనూ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యం ఆచార్యులు కోరారు. ప్రజలకు మేలు చేసేందుకే ఈ రీసర్వే చేపట్టామన్నారు. భూములకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందించి భూములను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఈ ర్యాలీల్లో డీటీ శరణ్య, సర్పంచ్‌లు కడి అరుణకుమారి, చెల్లుబోయిన రామశివ సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ, మండల సర్వేయర్ వాణి, వీఆర్వో ఝాన్సీ, బాలాజీ, స్థానికులు పాల్గొన్నారు.



పొన్నమండ సభలో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధవి

రాజోలు: రీ సర్వే నిర్వహిస్తున్న గ్రామాల్లోని భూయజమానులు రెవెన్యూ అధికారులకు సహకరించాలని అమలాపురం ఆర్డీఓ కె.మాధవి అన్నారు. బుధవారం పొన్నమండలో నిర్వహించిన గ్రామ సభలో ఆర్డీఓ మాధవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత గ్రామ సరిహద్దులు నిర్ధారించడంతో పాటు ప్రభుత్వ భూములను గుర్తిస్తారన్నారు. ఆ తర్వాత రైతు వారీ భూములకు సర్వే చేస్తారన్నారు. సర్వే సమయంలో భూమి ఎక్కువ, తక్కువలు ఉంటే మండల డిప్యూటీ తహసీల్దారుకు అప్పీళ్లు చేసుకోవచ్చన్నారు. రీ సర్వే అవగాహనపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్, సర్పంచ్ కుక్కల బేబికుమారి, డీటీ ఎంఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

మామిడికుదురు: పదో తరగతి పరీక్షల్లో భాగంగా బుధవారం రెండో పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండలంలోని ఆరు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా మామిడికుదురు, పాశర్లపూడి, మొగలికుదురులోని రెండు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షల తీరును పరిశీలించారు. మండల పరిధిలో మొత్తం 1,049 మంది విద్యార్థులకు 1,034 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు తెలిపారు. 15 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారన్నారు. 1,046 మంది రెగ్యులర్ విద్యార్థులకు 1,034 మంది పరీక్షలు రాశారన్నారు. ముగ్గురు ప్రైవేటు విద్యార్థులకు ఒక్కరు కూడా హాజరు కాలేదని చెప్పారు.

నలుగురి గైర్హాజరు

అంబాజీపేట: మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి హిందీ పరీక్షకు నలుగురు విద్యార్థులు గైర్హజరయినట్లు ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. అంబాజీపేట, పుల్లేటికుర్రు, తొండవరంలో 454 మందికి గాను 450 పరీక్ష రాశారన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: స్థానిక పదో తరగతి పరీక్ష కేంద్రాలను స్క్వాడ్ అధికారులు సందర్శించి తనిఖీలు జరిపారు. పదో తరగతి పరీక్షల్లో భాగంగా బుధవారం రెండో పరీక్ష సెకండ్ లాంగ్వేజ్ హిందీ పరీక్ష నిర్వహించారు. మండలంలోని 5 పరీక్ష కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 911 మందికి 907 మంది హాజరయ్యారు. నలుగురు గైర్హాజరయ్యారు. 3 కేంద్రాల్లో ఓపెన్ టెన్త్ ఇంగ్లీషు పరీక్ష రాస్తున్న 205 మందికి 190 మంది హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారు.

ముక్తేశ్వరంలో..

అయినవిల్లి: ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పదో తరగతి స్టేట్ అబ్జర్వర్ ముడ్డు రామలింగం, డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ బీర హనుమంతరావు బుధవారం పరిశీలించారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులను వీరు ఆరా తీశారు. పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సదుపాయాలను వీరు పరిశీలించారు.

వర్గీకరణకు కేబినెట్ ఆమోదంపై నిరసన

మలికిపురం: ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై మలికిపురంలో బుధవారం ఎస్సీ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ మేరకు మలికిపురం, సఖినేటిపల్లి మండలాల మాలల న్యాయపోరాట సమితి సభ్యులు నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ చింతా రాజబాబు ఆధ్వర్యంలో మలికిపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టి రాష్ట్ర కేబినెట్ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 2011 సంవత్సర జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని రాష్ట్ర కేబినెట్ ఎస్సీ వర్గీకరణ చేయడంపై ఆమోదం తెలపడం అవగాహనా రాహిత్యానికి నిదర్శనమన్నారు. తాజాగా షెడ్యూల్డ్ కులాలకు సంబంధించి కులగణన చేపట్టి ఎస్సీల్లో ఏ ఉపకులం ఎంత జనాభా ఉందో తేల్చిచెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం మలికిపురం, సఖినేటిపల్లి మండలాల తహసీల్దార్లకు పలు డిమాండ్లతో కూడిన మెమొరాండం ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ మండల కన్వీనర్లు తోటే రాజేష్, తాడి సహదేవ్, జేఏసీ నాయకులు గెడ్డం తులసీ భాస్కరరావు, నల్లి శివకుమార్, గెడ్డం ఫిలిప్ రాజు, సరేళ్ళ విజయప్రసాద్, బళ్ళ నోబుల్, భూసి జాన్ మోజేష్ తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురు సెంటర్‌లో మాలమహానాడు నేతల నిరసన

మామిడికుదురులో..

మామిడికుదురు: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర కేబినెట్‌లో తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ మాల మహానాడు నేతలు బుధవారం నిరసన తెలిపారు. మామిడికుదురు బస్టాండ్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. 2024-25 కులగణనను ప్రాతిపదికగా తీసుకుని వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామంటూ నినాదాలు చేశారు. పాత కులగణన ప్రాతిపదికగా తీసుకుని వర్గీకరణ చేపట్టడం ఎంతమాత్రం సహేతుకం కాదన్నారు. దీన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తామన్నారు. ఈ నిరసనలో మాల మహానాడు నేతలు బొంతు మణిరాజు, కలిగితి పళ్లంరాజు, మట్టా సత్తిబాబు, పాలమూరి గోపాల్, పిల్లి శ్రీనివాస్, విప్పర్తి రెడ్డి, రొక్కం వెంకటేశ్వరరావు, ఉల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మలికిపురంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్సీ సంఘాలు

మసీదుల అభివృద్ధికి విరాళాలు

కొత్తపేట: మసీదుల అభివృద్ధికి ఎండీ అబ్దుల్ సలాం కుటుంబ సభ్యులు రెహమాన్, దిల్‌దార్ బేగం నగదు విరాళాలు అందజేయడం అభినందనీయమని మండల ముస్లిం, మైనార్టీ నాయకుడు షేక్ గౌస్ అన్నారు. యానంకు చెందిన దివంగత దిల్‌దార్ బేగం తన ఆస్తి వాటా నుంచి పుట్టిన ఊరైన కొత్తపేట జామియా మసీదుకు రూ.50 వేలు, మెట్టినిల్లు యానం జామియా మసీదుకు రూ.50 వేలు ఇవ్వాలని కోరారు. ఆ మేరకు స్థానిక మసీదులో బుధవారం మధ్యాహ్నం ప్రత్యేక ప్రార్థనల అనంతరం చెక్కుల రూపంలో ఆయా మసీదు కమిటీల అధ్యక్షులు షేక్ ఖాజాబాబు, ఎస్‌కేఎం జిలానీలకు ఆమె సోదరుడు రెహమాన్ పై మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అతడిని ముస్లిం నాయకులు సత్కరించారు. వారికి ఆయా మసీదుల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మసీదు, షాదీఖానా కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాజాబాబు, మాజీ అధ్యక్షుడు షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.



రెహమాన్‌ను సత్కరిస్తున్న గౌస్, మసీదు కమిటీ నాయకులు

నేడు మండల సర్వసభ్య సమావేశం

అయినవిల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.భీమారావు బుధవారం నాడొక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు. మండలంలోని వివిధ సమస్యలపై ఈ సమావేశంలో చర్చకు వస్తాయన్నారు.

కళాశాల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

ఆలమూరు: మూడు దశాబ్దాల క్రితం శిథిలావస్థకు చేరుకుని ప్రస్తుత భయానక వాతావరణంలో ఉన్న ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్, రవికుమార్ విజ్ఞప్తి చేశారు. కళాశాల దుస్థితిపై జిల్లా విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ)ని కలసి బుధవారం వినతిపత్రం అందజేశారు. వారు విలేకరులతో మాట్లాడుతూ 90వ దశకంలో సుమారు 1000 మంది చదువుకునే ఈ కళాశాలలో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 100 లోపు ఉండటం దురదృష్టకరమన్నారు. కళాశాలకు సంబంధించి సరైన సౌకర్యాలు లేకపోవడంతో పాటు భవనం శిథిలావస్థకు చేరుకున్నందు వల్ల విద్యార్థులు చేరడం లేనందువల్ల ఏటా అడ్మిషన్లు సంఖ్య తగ్గుతూ వస్తుందన్నారు. అన్యాక్రాంతమైన కళాశాలకు చెందిన భూమిని పరిరక్షించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు.



ఆర్‌జేడీకి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు